సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం : 9 : జనవరి : 2025





భువిలో దేవలోకం అరకు, పాడేరు మండలాల్లోని మాడగడ, వంజంగి శిఖరాల్లో బుధవారం అద్భుత దృశ్యాలు ఆవిష్కృత మయ్యాయి. దేవలోకమే భువికి దిగి వచ్చిందా అన్నట్టుగా పాలసముద్రాన్ని తలపించాయి. వీటిని పర్యాటకులు తనివితీరా ఆస్వాదించారు. – సాక్షి, పాడేరు

పర భజన.. స్వ భజన
పరస్పర భజన

ప్రధాని మోదీ సభలో ఆద్యంతం ఇదే తంతు



ప్రధాని మోదీకి గవర్నర్ నజీర్ స్వాగతం

- స్టీల్‌ప్లాంట్‌పై భరోసా దక్కలేదు.. మెట్రో ఊసెత్తలేదు..
- భోగాపురం ఎయిర్‌పోర్ట్ కనెక్టివిటీ ప్రస్తావన లేదు
- చంద్రబాబు, పవన్ నోట వినిపించని 'ఉక్కు' మాట
- నిరసన తెలిపిన వారిని అరెస్టులు చేయించిన ప్రభుత్వం

విశాఖ సిటీ : ప్రధానమంత్రి **మోదీ సభతో కూటమి** ప్రభుత్వ బండారం బట్టబయలైంది. స్టీల్‌ప్లాంట్‌పై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు ఉన్న చిత్తశుద్ధేమిటో తేటతెల్లమైంది. గంటన్నర పాటు సాగిన ప్రసంగాల్లో ఎవరి నోటా స్టీల్‌ప్లాంట్ మాట రాలేదు. ఉక్కు పరిశ్రమ పరిరక్షణపై భరోసా రాలేదు. మెట్రో రైలు ప్రాజెక్టు ఊసెత్తలేదు. భోగాపురం విమానాశ్రయానికి కనెక్టివిటీ ప్రస్తావన లేదు. సభలో ఆద్యంతం పర భజన, స్వభజన, పరస్పర భజనే వినిపించింది. కేవలం ప్రధానిని పొగడ్తలతో ముంచెత్తడానికే కూటమి ప్రభుత్వం బహిరంగ సభ ఏర్పాటు



అభివృద్ధి ప్రాజెక్టులను వర్చువల్ విధానంలో ప్రారంభించిన అనంతరం పీఎం నరేంద్రమోదీ, చిత్రంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీసీఎం పవన్‌కళ్యాణ్, గవర్నర్ అబ్దుల్ నజీర్

చేసిందన్న భావన ప్రతీ ఒక్కరిలోను కలిగింది.

మిట్టల్ స్టీలే ముద్దా..?

విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై నోరెత్తని చంద్రబాబు మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌పై మాత్రం తెగ ప్రేమను కురిపిస్తున్నారు. మిట్టల్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు ఉన్న అడ్డంకులను ఎలా తొలగించాలన్న అంశంపై ప్రధాని మోదీతో మాట్లాడానని చంద్రబాబు సభలోనే చెప్పడం విశేషం. ఈ ప్లాంట్‌కు ప్రత్యేకంగా పైప్ లైన్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు స్పష్టం చేశారు. ఒక ప్రైవేటు స్టీల్‌ప్లాంట్ కోసం అంతలా తాపత్రయపడుతున్న చంద్రబాబు, పవన్‌లు విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కనీసం నోరెత్తకపోవడం అందరినీ విస్మయానికి గురిచేసింది. దేశంలో ఇతర ప్రాజెక్టులు, అంశాలను ప్రస్తావిస్తూ మోదీపై పొగడ్తల వర్షం కురిపించిన ఇరువురూ.. విశాఖకు సంబంధించి ఒక అంశాన్ని ప్రధాని దృష్టికి తీసుకువెళ్లకపోవడం గమనార్హం.

'ఉక్కు' నిరసనలు.. అరెస్టులు

స్టీల్‌ప్లాంట్ భవితవ్యంపై భరోసా ఇవ్వాలని వామపక్ష పార్టీలు, ప్రజా, కార్మిక సంఘాల నాయకులు పట్టుబట్టారు. విశాఖ పర్యటనకు వచ్చిన ప్రధానితో దీనిపై ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. దీంతో కూటమి ప్రభుత్వం వీరిలో చాలా మందిని గృహ నిర్బంధం చేసింది. ఉక్కుపై లేచిన నోర్లను మూయించే ప్రయత్నం చేసింది. అయినప్పటికీ కొంత మంది మద్దిలపాలెం, ఇతర ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దీంతో వారిని అరెస్టులు చేయించింది.



'ఉక్కు'పై నోరుమెదపని సీఎం, డీసీఎం

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యోగ, కార్మిక సంఘాలు 1,427 రోజులుగా నిరసనలు, ఆందోళనలు చేపడుతున్నాయి. ప్రధాని మంత్రి విశాఖ పర్యటన సందర్భంలో అయినా ఉక్కు పరిశ్రమ పరిరక్షణపై భరోసా వస్తుందని అందరూ భావించారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనంపై ప్రధానితో ఒక ప్రకటన చేయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లను కార్మిక సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. గత మూడు రోజులుగా బైక్ ర్యాలీలు, ఆందోళనలు చేపట్టారు. పీఎం సభలో స్టీల్‌ప్లాంట్‌పై ఒక భరోసా వస్తుందని ఆశపడ్డారు. కానీ ఇవేవీ చంద్రబాబు, పవన్‌లకు వినిపించలేదు. బహిరంగ సభలో ఇద్దరి నోటా స్టీల్‌ప్లాంట్ మాట వినిపించలేదు. ఉక్కు పరిశ్రమపై భరోసా ఇవ్వాలని కనీసం అడిగే ధైర్యం కూడా చేయలేదు.

విశాఖ అభివృద్ధి ప్రస్తావన లేదు

ప్రధాని మోదీ సభలో విశాఖ అభివృద్ధి ప్రస్తావన లేకుండా పోయింది. ప్రధానంగా మెట్రో రైలు ప్రాజెక్టుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం డీపీఆర్‌ను సైతం సిద్ధం చేసింది. దీనికి నిధులు మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరింది. తాజాగా ప్రధాని మోదీ విశాఖ వచ్చిన సందర్భంలో మెట్రో ప్రాజెక్టుపై ప్రకటన వచ్చే అవకాశం ఉందని అందరూ భావించారు. కానీ చంద్రబాబు గానీ, పవన్ కల్యాణ్ గానీ మెట్రో రైలు ప్రాజెక్టును కూడా ప్రస్తావించలేదు. అలాగే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో శంకుస్థాపన జరిగి నిర్మాణంలో ఉన్న భోగాపురం విమానాశ్రయ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. విశాఖ నుంచి ఈ ఎయిర్‌పోర్టుకు వేగవంతంగా చేరుకునేందుకు వీలుగా కనెక్టివిటీ రహదారుల అభివద్ధికి గత ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. దానిపై కూడా చంద్రబాబు నోరెత్తలేదు. విశాఖకు సంబంధించి ఒక ప్రాజెక్టు ప్రస్తావన లేకుండానే సభను ముగించారు.

ప్రశాంతంగా ప్రధాని పర్యటన

- **సాయంత్రం 4.30**కు రోడ్ షో
- **ఓపెన్ టాప్ జీప్‌లో** ప్రజలకు అభివాదం **చేసిన ప్రధాని మోదీ**
- **పూలతో స్వాగతం** పలికిన ప్రజలు
- **బహిరంగ సభలో** పలు ప్రాజెక్టులకు **వర్చువల్‌గా శంకుస్థాపన**



రోడ్డు షోలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

విశాఖ సిటీ : ప్రధాని మోదీ విశాఖ పర్యటన విజయ**వంతంగా ముగిసింది. భారీ** భద్రతా ఏర్పాట్ల మధ్య **రోడ్ షో, బహిరంగ సభ** ప్రశాంతంగా సాగింది. **ప్రధాని బుధవారం సాయ**ంత్రం 4.15కు ఇండియన్ **ఎయిర్‌ఫోర్స్ విమానంలో** విశాఖ ఎయిర్‌పోర్ట్‌కు **చేరుకున్నారు. అక్కడ గవర్న**ర్ అబ్దుల్ నజీర్, ముఖ్య**మంత్రి చంద్రబాబు, డిప్యూ**టీ సీఎం పవన్ కల్యాణ్‌లు **ప్రధానికి స్వాగతం పలికా**రు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో సిరిపురం ప్రాంతంలోని వెంకటాద్రి వంటిల్లు ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ ఓపెన్ టాప్ జీప్ ఎక్కారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న జనాలకు అభివాదాలు చేస్తూ ముందుకు సాగారు. ప్రజలు కూడా పూలతో మోదీకి స్వాగతం పలికారు. సాయంత్రం 5.30కు ఏయూ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి చేరుకున్నారు.

జీప్‌లో లోకేష్‌కు దక్కని చోటు

ప్రధాని సభ సందర్భంగా నగరమంతా హోర్డింగ్‌లు, కటౌట్లు వెలిశాయి. అన్నింటిలోను మోదీ, చంద్రబాబు, పవన్, లోకేష్ ఫొటోలే దర్శనమిచ్చాయి. బీజేపీ వారి ఫొటోలు ఎక్కడా కనిపించలేదు. దీంతో మోదీ రోడ్ షోలో కూడా లోకేష్ ఉంటారని అందరూ భావించారు. అయితే అనూహ్యంగా ఓపెన్ టాప్ జీప్‌లో లోకేష్‌కు చోట దక్కలేదు. ప్రధాని మోదీ రోడ్‌షో జీప్‌లో చంద్రబాబు, పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు డి.పురందేశ్వరీలు మాత్రమే ఉన్నారు.

చంద్రబాబు స్పీచ్ మధ్యలోనే జనాలు జంప్

బహిరంగ సభ సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమైంది. అనకాపల్లి ఎంపీ సి.ఎం.రమేష్, మంత్రి లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు కేవలం 5 నుంచి 10 నిమిషాలు మాత్రమే ప్రసంగించారు. అనంతరం మైక్ అందుకు చంద్రబాబు మాత్రం అరగంటకు పైగా మాట్లాడారు. దీంతో ఆయన స్పీచ్ మధ్యలోనే జనాలు వెళ్లిపోవడం ప్రారంభించారు. దీంతో అరగంట తరువాత స్పీచ్‌ను వేగంగా పూర్తి చేశారు. అనంతరం ప్రధాని మోదీ ప్రజలను ఉద్దేశించి 20 నిమిషాలు ప్రసంగించారు. ఈ సందర్భంగా రూ.2 లక్షలు విలువైన పలు ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. సభ అనంతరం ప్రధాని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ విమానంలో భువనేశ్వర్‌కు పయనమయ్యారు.

30 వేల మంది రాక

ప్రధాని సభకు భారీగా జనాలను తరలించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. అయితే సభా ప్రాంగణంలో మూడు టెంట్లు ఏర్పాటు చేసి ఒక్కో దానిలో 7 వేల సీట్లను ఏర్పాటు చేశారు. ఉత్తరాంధ్ర నుంచి బస్సులు, ఆటోలు, ఇతర వాహనాల్లో జనాలను తరలించారు. రోడ్ షో, బహిరంగ సభకు లక్ష నుంచి రెండు లక్షల మంది జనాలు వచ్చినట్లు కూటమి ప్రభుత్వం ప్రకటించినా.. వాస్తవ సీటింగ్ సామర్థ్యం ప్రకారం 30 వేల మంది మాత్రమే సభకు హాజరైనట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు చెబుతున్నాయి.

భారీ భద్రతా ఏర్పాట్లు

ప్రధాని సభకు పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. 5 వేల మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు కల్పించారు. ఒకవైపు వీఐపీలకు భద్రతా చర్యలు చేపడుతూనే.. మరోవైపు ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా ఉండేందుకు ప్రణాళికబద్ధంగా ఏర్పాట్లు చేశారు. ఇతర జిల్లాల నుంచి వచ్చే బస్సులు, ప్రైవేటు వాహనాలను నిలిపేందుకు ప్రత్యేకంగా పార్కింగ్ సౌకర్యాలు కల్పించారు. దీంతో ప్రశాంతంగా ప్రధాని సభ ముగిసింది.

న్యూస్‌రీల్

వణికిస్తున్న చలిగాలులు

- ఉదయం 10గంటల వరకు పొగమంచు
- మినుములూరులో 11, చింతపల్లిలో 11.3, అరకులోయలో 12డిగ్రీల నమోదు



పాడేరులో పొగమంచు దృశ్యం

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో చలిగాలులు కొనసాగుతున్నాయి.అన్ని ప్రాంతాల్లో ఉదయం 10గంటల వరకు పొగమంచు దట్టంగా కురుస్తోంది. సూర్యోదయం ఆలస్యమవుతోంది. పొగమంచు తీవ్రతకు వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. చలిగాలులతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. బుధవారం పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో 11డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 11.3 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో 12డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

వైద్యశాఖలో ఉద్యోగాలకు రేపటి వరకు దరఖాస్తు గడువు

- రంపచోడవరంలో స్వీకరణ కౌంటర్

సాక్షి,పాడేరు: స్థానిక వైద్య కళాశాల, పాడేరు జిల్లా సర్వజన ఆస్పత్రిలో అవుట్ సోర్సింగ్,కాంట్రాక్ట్ విధానంలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ గడువు ఈనెల 10వతేదీ సాయంత్రంతో ముగుస్తుందని ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హేమలతాదేవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. చింతూరు, రంపచోడవరం డివిజన్ల పరిధిలోని దరఖాస్తుదారుల సౌకర్యార్థం ఈనెల 9,10 తేదీల్లో రంపచోడవరం ఏడీఎంహెచ్‌వో(అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి) కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ను కలెక్టర్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేస్తున్నట్టు ఆమె తెలిపారు. ఆయా ప్రాంతాల్లోని అభ్యర్థులు పాడేరు వైద్య కళాశాలకు రాకుండా రంపచోడవరం కౌంటర్‌లోనే దరఖాస్తులు అందజేయాలని ఆమె కోరారు. పారామెడికల్, సపోర్టింగ్ స్టాఫ్ విభాగాలలో 29 కేటగిరీలకు సంబంధించి 244 పోస్టులు భర్తీ చేస్తున్నామని తెలిపారు. వీటిలో కాంట్రాక్ట్ పోస్టులు 107, అవుట్ సోర్సింగ్ పోస్టులు 137 ఉన్నాయన్నారు. గత నెల 31వతేదీ నుంచి దరఖాస్తులు స్వీకరణ ప్రారంభించామని తెలిపారు. జనవరి 10వతేదీ సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని,మరిన్ని వివరాలు www.gmcpaderu.com ఉన్నాయని ఆమె సూచించారు.

మత్స్యగెడ్డ పరివాహక అందాలు అద్భుతం



సుజనకోటలో మత్స్యగెడ్డ పరివాహక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



సుజనకోట గిరిజనులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

8లో

ముంచంగిపుట్టు మండలంలోని సుజనకోట పంచాయతీలో విస్తరించి ఉన్న మత్స్యగెడ్డ అందాలు అద్భుతంగా ఉన్నాయని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన ఆ ప్రాంతంలో పర్యటించారు.

చిన్నారికి తీవ్ర అస్వస్థత

- కాలం చెల్లిన పెరుగు ప్యాకెట్‌ను వినియోగించడంతో విషమించిన ఆరోగ్యం
- వెంటనే ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తరలింపు
- సకాలంలో వైద్యం అందించడంతో తప్పిన ప్రాణాపాయం



కాలం చెల్లిన పెరుగు ప్యాకెట్‌ను చూపిస్తున్న తండ్రి సుబ్రహ్మణ్యం

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో కిరాణా షాప్‌లో కాలం చెల్లిన విశాఖ డెయిరీకి చెందిన పెరుగు ప్యాకెట్‌ను భోజనంలో వినియోగించడం వల్ల ఏడేళ్ల చిన్నారి తీవ్ర అస్వస్థతకు గురైంది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. స్థానిక కిరాణా వ్యాపారి ప్రభాకర్ దుకాణంలో మంగళవారం సాయంత్రం పెరుగు ప్యాకెట్ కొని ఇంటికి తీసుకొని వెళ్లినట్టు చిన్నారి తండ్రి మొస్య సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ పెరుగుతో కుమార్తె పూజారాణి (7)కి అన్నం పెట్టామని, కొద్ది సమయంలోనే తీవ్ర అస్వస్థకు గురైందని ఆయన వివరించారు. పెరుగు ప్యాకెట్‌పై గత నెల 25వ తేదీన కాలం చెల్లినట్లు ఉందన్నారు. దీంతో వెంటనే స్థానిక సీహెచ్‌సీకి తరలించడంతో తమ కుమార్తెకు ప్రాణాపాయం తప్పిందని ఆయన వివరించారు. ఇలావుండగా కాలం చెల్లిన వాటిని విక్రయిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- తల్లిదండ్రులకు గుర్తింపు కార్డులు
- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



మాట్లాడుతున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు : గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. బుధవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏటీడబ్ల్యూవోలు, ఆశ్రమ పాఠశాలల హెచ్‌ఎంలు, గిరిజన గురుకులాల ప్రిన్సిపాళ్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. ప్రతి పాఠశాలలో ఒక ప్రామాణిక విధానాన్ని అమలు చేయాలన్నారు. పదో తరగతి విద్యార్థుల కోసం వంద రోజుల ప్రణాళిక పక్కాగా అమలు చేయాలని సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు జారీ చేసిన ఫార్మట్‌లో ఆశ్రమ పాఠశాలల హెచ్‌ఎంలు ప్రతి నెలా నివేదికలు సమర్పించాలన్నారు. విద్యార్థులు అనారోగ్యానికి గురైతే వారిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సిక్ రూమ్‌లో ఉంచాలని సూచించారు. అవసరమైతే ఆస్పత్రులకు తరలించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేస్తామన్నారు. గుర్తింపు కార్డు కలిగిన వారితోనే విద్యార్థులను బయటకు పంపించాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో మూమెంట్ రిజిస్టర్లను పక్కాగా అమలు చేయాలన్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు మాత్రమే తల్లిదండ్రులు, సంరక్షకులను అనుమతించాలని సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల అనర్థాలపై విద్యార్థులకు తరచూ కౌన్సిలింగ్ చేయాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో మార్గదర్శిని కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు. ఎక్కడైన గంజాయి వినియోగించే విద్యార్థులు బయటపడితే తక్షణమే డి ఎడిక్షన్ కేంద్రానికి తరలించి కౌన్సిలింగ్ చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో టీడబ్ల్యూ ఇంచార్జీ డీడీ రజని, డీఈవో బ్రహ్మాజీరావు, 11మండలాల ఏటీడబ్ల్యూవోలు,హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆస్పిరేషనల్ బ్లాక్ ఫెలోషిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

రంపచోడవరం: వై.రామవరం మండలంలో నీతి ఆయోగ్ పథకంలో భాగంగా ఆస్పిరేషనల్ బ్లాక్ ఫెలోషిప్‌కు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం కోరారు. మూడు నెలలపాటు ఉండే ఈ కార్యక్రమానికి నిర్దిష్ట వేతనం రూ.55 వేలు చెల్లిస్తారని ఆయన తెలిపారు. పూర్తి తాత్కాలిక ప్రాతిపదికన జనవరి నుంచి మూడు నెలల పాటు నియామకం ఉంటుందన్నారు. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి పీజీ అర్హతగా నిర్ణయించడమైందన్నారు. అలాగే డేటా అనాలసిస్, ప్రెజెంటేషన్, సోషల్ మీడియా, ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, లోకల్ లాంగ్వేజిపై పరిజ్ఞానం ఉండాలని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 9 నుంచి 19వ తేదీ లోపు దరఖాస్తులను స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో అందజేయలన్నారు .పూర్తి వివరాలు ఐటీడీఏ నోటీసు బోర్డులో ఉన్నట్లు తెలిపారు. గడువులోపు స్వీకరించిన దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పీవో పేర్కొన్నారు.

ఎస్సీల కులగణనపై అభ్యంతరాల స్వీకరణ

- ఈనెల 12 వరకు గడువు పొడిగింపు

పాడేరు రూరల్: ఎస్సీ జనాభా వివరాలపై సోషల్ ఆడిట్ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఎస్సీ సంక్షేమ జిల్లా సాధికారత అధికారి జనార్దన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం వద్ద ఉన్న ఎస్సీ కులగణన వివరాలను గత నెల 26 నుంచి గ్రామ/ వార్డు సచివాలయాల్లో ప్రదర్శించినట్టు తెలిపారు. వీటిపై అభ్యంతరాల స్వీకరణ గడువును ఈనెల 12 వరకు పొడిగించిందన్నారు. ఈ మేరకు స్వీకరించిన అభ్యంతరాలను ఈ నెల 16 వరకు క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తారని ఆయన పేర్కొన్నారు. ఇలా సమగ్ర వివరాల సేకరణ అనంతరం ఈనెల 20న కులగణన తుది వివరాలను గ్రామ వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తారని ఆయన వివరించారు. వీటిపై అభ్యంతరాలను సేకరించిన వీఆర్వో మూడు దశల్లో తనిఖీ చేస్తారని తెలిపారు. ఈ వివరాలను పునఃపరిశీలించిన తహసీల్దార్ తుది ఆమోదం తెలిపి పోర్టల్‌లో పొందుపరుస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు మార్గదర్శకాలు విడుదల అయ్యాయన్నారు.

కాఫీ కొనుగోళ్లు ప్రారంభం



లంబసింగిలో కొనుగోళ్లను ప్రారంభిస్తున్న జీసీసీ డీఎం దేవరాజ్

చింతపల్లి: జీసీసీ ఆధ్వర్యంలో చింతపల్లి సబ్ డివిజనల్ పరిధిలో బుధవారం నుంచి కాఫీ కొనుగోళ్లు ప్రారంభించినట్లు ఆ సంస్థ డివిజనల్ మేనేజర్ పి.దేవరాజ్ తెలిపారు. బుధవారం లంబసింగిలో కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది కాఫీ దిగుబడులు ప్రారంభమయ్యాయన్నారు. గిరిజన రైతాంగానికి మంచి మద్దతు ధర అందించాలనే లక్ష్యంతో తమ సంస్థ గరిష్ట ధరలను ప్రకటించిందన్నారు. అంతర్జాతీయ మార్కెట్ ధరలకు అనుకూలంగా . పార్చిమెంటు కిలో రూ.320, చెర్రి రూ.170, రొబస్టా రూ.100కు కొనుగోలు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నేరుగా తమ సిబ్బంది ఇళ్ల వద్దకు వెళ్లి కొనుగోలు చేపట్టడమే కాకుండా వెంటనే సొమ్ము చెల్లిస్తున్నట్టు డీఎం పేర్కొన్నారు.

మత్స్యగెడ్డ పరివాహక అందాలు అద్భుతం

- పర్యాటక ప్రాంతంగా అభివృద్ధికి చర్యలు
- కలెక్టర్ దినేష్‌కుమార్
- సుజనకోట, జోలాపుట్టు, దుడుమ ప్రాంతాల్లో పర్యటన



ఏకలవ్య పాఠశాల పనుల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ దినేష్‌కుమార్



జోలాపుట్టులో విద్యార్థులతో హిందీ చదివిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ముంచంగిపుట్టు: సుజనకోట పంచాయతీలో విస్తరించి ఉన్న మత్స్యగెడ్డ అందాలు అద్భుతంగా ఉన్నాయని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. మండలంలోని సుజనకోట, జోలాపుట్టు, దుడుమ పర్యాటక ప్రదేశాలను బుధవారం ఆయన సందర్శించారు. సుజనకోటలో ఆయనకు సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మి, స్థానిక గిరిజనులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. శాలువా కప్పి సన్మానించారు. సుజనకోట–మత్రిపుట్టు గ్రామాల మధ్య మెలికలు తిరుగుతూ దీవుల మధ్య ప్రవహించే మత్స్యగెడ్డ పాయల అందాలకు ఆయన ఫిదా అయ్యారు. ఫొటోలు, వీడియో తీశారు. సుజనకోట పరిసర ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. మత్స్యగెడ్డ అందాలకు ప్రత్యేక నిధులు కేటాయించి, కేరళ తరహాలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. అక్కడ నుంచి పర్యాటక శాఖ అధికారులతో ఫోన్లో మాట్లాడారు. సుజనకోట, మత్స్యగెడ్డ పరివాహిక ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని, బోటు షికారు, కాటేజీల నిర్మాణాలకు అనువైన స్థలం, వ్యూపాయింట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మత్స్యగెడ్డలో నాటు పడవ ప్రయాణం చేసేందుకు సిద్ధమైన కలెక్టర్ నీటి స్థాయిని చూసి విరమించారు. జోలాపుట్టు జలాశయాన్ని సందర్శించిన ఆయన నీటిమట్టం వివరాలను సిబ్బంది నుంచి తెలుసుకున్నారు. దుడుమ జలాశయం, జలపాతం అందాలకు మంత్రముగ్ధులయ్యారు. ఒడిశా అధికారులు కల్పించిన పర్యాటక సౌకర్యాలు ఆయనను ఆకట్టుకున్నాయి.

ఏకలవ్య పాఠశాల వేగవంతం

జోలాపుట్టు పంచాయతీ లబ్బూరు గ్రామ సమీపంలో చేపట్టిన ఏకలవ్య పాఠశాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలనికలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. బుధవారం మండల పర్యటనకు వచ్చిన ఆయనను వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జగబంధు, జోలాపుట్టు సర్పంచ్ నీలకంఠం, ఎంపీటీసీ కమల కలిశారు. ఏకలవ్య పాఠశాల నిర్మాణంలో జాప్యాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన కలెక్టర్ లబ్బూరులో నిర్మాణ దశలో ఉన్న ఏకలవ్య పాఠశాలను సందర్శించారు. నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ట్రైబల్ వెల్ఫేర్ అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో శ్రీసాయిహర్ష, పీఆర్ ఏఈ గోపాలకృష్ణ, ఆర్ఐ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై ఆగ్రహం

ముంచంగిపుట్టు: టెన్త్ విద్యార్థులు హిందీని సక్రమంగా చదవకపోవడంపై కలెక్టర్ దినేష్‌కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. జోలాపుట్టు ఇంగ్లీష్ మీడియం బాలికల పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. టెన్త్ విద్యార్థుల క్లాస్ రూమ్‌కు వెళ్లిన ఆయన అదే సమయంలో జరుగుతున్న హిందీ సబ్జెక్టును విద్యార్థులతో చదివించారు. తరగతి గదిలో ఉన్న 39 మంది విద్యార్థుల్లో పది మంది కూడా సక్రమంగా చదవలేకపోవడంపై ఆయన అసంతృప్తికి గురయ్యారు. ఇంగ్లీష్ సబ్జెక్టులో సైతం విద్యార్థులు ఇలాగే ఉండడంపై ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల సామర్థ్యం ఈ విధంగా ఉంటే వారి భవిష్యత్తు ఏంటని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. ఇప్పటికైనా తీరు మార్చుకొని ఆయా సబ్జెక్టుల్లో విద్యార్థుల సామర్థ్యం మెరుగుపరిచే విధంగా బోధించాలని సూచించారు.అనంతరం లబ్బూరు పీహెచ్‌సీని తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. మందుల గదిని తనిఖీ చేసిన ఆయన నిల్వలు, ఓపీ వివరాలను వైద్యాధికారుల నుంచి తెలుసుకున్నారు.

బలిమెల నీటి వినియోగంపై సమీక్ష

సమావేశమైన ఇరు రాష్ట్రాల అధికారులు

సీలేరు: ఆంధ్ర ఒడిశా సరిహద్దు ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయ నీటి వినియోగంపై బుధవారం స్థానిక ఏపీ జెన్‌కో అతిథి గృహంలో ఇరు రాష్ట్రాల అధికారులు సమావేశమై చర్చించారు. బలిమెల జలాశయంలో ప్రస్తుతం 64.92 టీఎంసీలు, జోలాపుట్టు జలాశయంలో 26.475 టీఎంసీల చొప్పున రెండు జలాశయాల్లో కలిపి మొత్తం 91.3956 టీఎంసీల నీరు ఉందని తెలిపారు. రాబోయే రోజుల్లో రెండు జలాశయాల్లో సుమారు 2500 టీఎంసీలకు నీరు చేరే అవకాశం ఉన్నందున మొత్తం 93.89 టీఎంసీలుగా లెక్కలు తేల్చారు. ఇందులో ఆంధ్రా వాటాగా 60.5922 టీఎంసీలు, ఒడిశా వాటాగా 33.3034 టీఎంసీలుగా నిర్ణయించారు. గతేడాది జూలై నుంచి డిసెంబర్ వరకు ఒడిశా తనవాటాగా 59.63 టీఎంసీలు, ఆంధ్రా తన వాటాగా 32.35 టీఎంసీలు వినియోగించుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఒడిశా ఆంధ్రా కంటే 27.28 టీఎంసీలు అధికంగా వినియోగించుకున్నట్లు ఇరు రాష్ట్రాల అధికారులు పేర్కొన్నారు. గ్రిడ్ డిమాండ్, ఇరిగేషన్ అవసరాల నిమిత్తం ఆంధ్రా వాటాగా 4 వేల క్యూసెక్కులు, ఒడిస్సా వాటాగా 1500 క్యూసెక్కులను జనవరి నెలాఖరుకు బలిమెల జలాశయం నుంచి వినియోగించుకునేలా ఇరు రాష్ట్రాల మధ్య ఏకగ్రీవంగా ఒప్పందం కుదిరింది. ఈ కార్యక్రమంలో ఒడిశా హైడ్రో కార్పొరేషన్ అధికారులు డిప్యూటీ జనరల్ మేనేజర్ ప్రసన్నకుమార్ మహాపాత్రో , అసిస్టెంట్ జీఎం ఓం ప్రకాష్ ,బలిమెల జనరేషన్ డిప్యూటీ మేనజర్ రాకేష్ పాణిగ్రాహి ,ఎర్త్ డ్యాం డివిజన్ సూపరింటెండెంట్ ఇంజనీరు రమాకాంత్ పాత్రో ,అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు తుషారంజన్ కుంతే, ఏఈఈలు గడాధర్ ప్రధాన్, కేసీ పాణి, ఆంధ్రా తరపున ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ అధికారులు, ఎస్ఈ బి. చంద్రశేఖర్ రెడ్డి , ఈఈ లు ఎం శ్రీనివాసరెడ్డి, వి. రాజేంద్రపసాద్, డీఈఈ దుర్గా శ్రీనివాసరావు, ఏఈఈ సీహెచ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు కార్పెట్లు పంపిణీ

రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం



కార్పెట్లు అందజేస్తున్న పీవో సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ

రంపచోడవరం: మారేడుమిల్లి, వై.రామవరం మండలాల్లోని ప్రాథమిక పాఠశాలలకు కార్పెట్లు అందజేసినట్టు రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం చెప్పారు. ఐటీడీఏ కార్యాలయం ప్రాంగణంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో వై.రామవరం, మారేడుమిల్లి మండలాల్లోని పాఠశాలలకు సబ్ కలెక్టర్ కల్పశ్రీతో కలిసి బుధవారం ఆయా ఎంఈవో, వెల్ఫేర్ అసిస్టెంట్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా పీవో సింహాచలం మాట్లాడుతూ ఐటీడీఏ, ఐడీఎఫ్‌సీ బ్యాంకు, తుని శాఖ ఆధ్వర్యంలో కార్పెట్లు అందజేస్తామన్నారు. సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ క్షేత్రస్థాయి పరిశీలనలో విద్యార్థులు కింద కూర్చోవడంతో చలికి ఇబ్బంది పడుతున్నట్టు గుర్తించినట్లు తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని కార్పెట్లు అందజేసినట్లు తెలిపారు. ఎంఈవో వి.ముత్యాలరావు, వెంకటరమణ, ఎంపీడీవో బాపన్నదొర, డీఈ నాగరాజు, మేనేజర్ మూర్తి, కాజా, అఖిల్‌రెడ్డి పాల్గొన్నారు.

లోతుగెడ్డ, లంబసింగి కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

- పాడేరు డీఎల్పీవో సీఎస్ కుమార్ ఆదేశం
- విధులకు గైర్హాజర్ కావడంపై ఆగ్రహం



లోతుగెడ్డ గ్రామ సచివాలయాన్ని సందర్శించిన డీఎల్పీవో కుమార్

చింతపల్లి: మండలంలో విధుల్లో నిర్లక్ష్యం వహించిన లోతుగెడ్డ, లంబసింగి కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని పాడేరు డీఎల్పీవో పీఎస్ కుమార్ ఎంపీడీవో శ్రీనివాసురావును ఆదేశించారు. బుధవారం మండలంలోని లోతుగెడ్డ, లంబసింగి గ్రామ సచివాలయాలను ఆయన సందిర్శించారు. సచివాలయ సిబ్బంది విధులను పర్యవేక్షించాల్సిన లోతుగెడ్డ కార్యదర్శి సీహెచ్ రవికుమార్, లంబసింగి కార్యదర్శి పి. అప్పలరాజు ఈ నెల నాలుగు నుంచి విధులకు గైర్హాజరు కావడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బంది పనివేళలు పాటించాలని, పన్నుల వసూళ్లు, పారిశుధ్యం మెరుగుపరచడం, తాగునీటి వనరులు నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధవహించాలని ఆదేశించారు.సచివాలయ సిబ్బందికి బయోమెట్రిక్ హాజరు ఆధారంగానే జీతాలు చెల్లిస్తామని స్పష్టం చేశారు. సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

సింహాచలం దేవస్థానానికి కూరగాయలు

- స్థానికుల సహకారంతో సమకూర్చిన భక్తురాలు కనకమహాలక్ష్మి

హుకుంపేట: సింహాచలం దేవస్థానం నిత్యాన్నదాన కార్యక్రమానికి ఈ ప్రాంతంలో పండించిన కూరగాయలు, గుమ్మడి, చింతకాలయను బుధవారం మండల కేంద్రం నుంచి పంపించారు. కోరిబిల్లి కనకమహాలక్ష్మి ఆధ్వర్యంలో వీటిని సేకరించారు. ప్రత్యేక వాహనంలో తరలించినట్టు ఆమె తెలిపారు. స్థానికులు, భక్తుల సహకారంతో వీటిని సమకూర్చామని ఆమె పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా ఇలా పంపిస్తున్నామని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రామరాజు, రాంబాబు, జగ్గమ్మ, భవాని, శివ పాల్గొన్నారు.

లిక్విడ్ గంజాయి స్వాధీనం

- విలువ రూ.5 లక్షలు
- తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



నిందితుడితో పోలీసులు

మోతుగూడెం: లిక్విడ్ గంజాయిని తరలిస్తూ వ్యక్తి పట్టుబడినట్లు డొంకరాయి ఎస్ఐ శివకుమార్ తెలిపారు. డొంకరాయి గ్రామ శివారులోని వన దుర్గ అమ్మ వారి ఆలయం వద్ద హైదరాబాద్‌కు చెందిన రాహుల్ చంద్రకాప్రి అనే వ్యక్తి అనుమానాస్పదంగా ఉన్నాడు. వెంటనే అతనిని పట్టుకుని విచారించగా రూ.5 లక్షల విలువైన లిక్విడ్ గంజాయి లభ్యమైందని ఎస్ఐ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

పోలవరం సర్వే వేగవంతానికి చర్యలు

చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న పీవో అపూర్వభరత్

చింతూరు: పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించి గృహాల విలువ, ఆర్అండ్ఆర్ సర్వే పనులను వేగవంతం చేయనున్నట్లు చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ తెలిపారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన మీకోసం గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొన్న పీవో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలకు సంబంధించిన అర్జీలను పరిశీలించి వెంటనే తగు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలవరం ఇరిగేషన్ కార్యాలయానికి కొత్తగా ఏడుగురు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను ప్రభుత్వం నియమించిందని, సంక్రాంతి అనంతరం సర్వే పనులు వేగవంతమయ్యేలా చర్యలు చేపడతామని ఆయన తెలిపారు. పెండింగ్‌లో ఉన్న గృహాల విలువకు సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆయన సూచించారు. గ్రీవెన్స్‌లో భాగంగా వివిధ సమస్యలకు సంబంధించి 36 దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేడ్కర్, ఏపీవో జగన్నాథం పాల్గొన్నారు.

ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్‌కు గాయాలు



రచ్చపల్లి గ్రామం వద్ద ప్రమాదానికి గురైన ట్రాక్టర్



గాయపడిన డ్రైవర్ మత్స్యలింగం

జి.మాడుగుల: చింతపల్లి వెళ్లే మార్గంలో రచ్చపల్లి–ఎం.నిట్టాపుట్టు గ్రామాల మధ్య మలుపు వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి గోతులోనికి దూసుకుపోయిన సంఘటనలో ట్రాక్టర్ డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో కంబాలుబయలు నుంచి క్వారీ చిప్స్‌లోడుతో కొత్తపల్లికి వెళ్తుండగా రచ్చపల్లి గ్రామంలోని మలుపు వద్ద ట్రాక్టర్ టైర్ ముందు చక్రం విరిగిపోయిపోవటంతో పక్కనున్న గోతిలోకి దూసుకెళ్లి ప్రమాదం జరిగినట్టు స్థానికులు తెలిపారు. ఈ సంఘటనలో మండలంలో సాడేక్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ సెగ్గె మత్స్యలింగంకు మక్క ఎముక విరిగిపోయింది. 108 వాహనంలో స్థానిక పీహెచ్‌సీకి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం పాడేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ట్రాక్టర్ తొట్టె రోడ్డుపై పడటంతో చిప్స్‌ంతా రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. దీంతో వాహనాల రాకపోకలు కొంత సమయం అంతరాయం ఏర్పండి. ఈ ప్రమాద సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందాల్సి ఉంది.

విద్యుత్ తీగలు తగిలి ఒకరు మృతి.. మరొకరికి గాయాలు



సంబురెడ్డి మృతదేహం

వై.రామవరం : వన్య ప్రాణుల వేట కోసం అమర్చిన విద్యుత్ తీగలు తగులుకొని ఒకరు మృతి చెందగా మరొకరు గాయాలు పాలైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వై.రామవరం మండలం దారగడ్డ పంచాయతీ పోలమానుగొంది గ్రామ సమీపంలో ఈ సంఘటన జరిగింది. ఈ కేసుకు సంబంధించిన బుధవారం ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో వన్య ప్రాణుల కోసం అమర్చిన విద్యుత్ తీగను గుర్తించకుండా తాకడంతో దారగడ్డ పంచాయతీకి చెందిన కడబాల సంబురెడ్డి(30) మృతి చెందగా, చెదల పండురెడ్డి తీవ్రంగా గాయపడ్డాడని ఆయన తెలిపారు. ఈ ఘటనలో పండురెడ్డిని రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నట్టు చెప్పారు. సంబురెడ్డి, పండురెడ్డి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు విద్యుత్ తీగలు అమర్చాడనే అనుమానంపై దారగడ్డ గ్రామానికి చెందిన కడబాల బుజ్జిబాబు రెడ్డి అనే వ్యక్తిపై అనుమానస్పద కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. సిఐ నరసింహామూర్తి ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కాలినడకన బలిమెల టు కన్యాకుమారి

3,500 కి.మీ.. 50 రోజుల ప్రయాణం



బిశ్వనాథ్‌దాస్

సీలేరు: ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా ఎంవీ–36 గ్రామానికి చెందిన బిశ్వనాథ్ దాస్ కాలినడకన బలిమెల నుంచి కన్యాకుమారి వెళ్లారు.. పుణ్యక్షేత్రాలను కాలినడకన దర్శించుకోవాలనే ధృడ సంకల్పంతోనే ముందుకు సాగినట్టు ఆయన చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. బలిమెలకు చెందిన ట్రక్ డ్రైవర్‌గా తన జీవనోపాధి సాగిస్తున్నాడు. తన గ్రామం నుంచి వివిధ దేవాలయాలను సందర్శిస్తూ కన్యాకుమారి చేరుకోవడానికి ఒకవైపు 25 రోజులు పట్టిందన్నారు. తిరుగు ప్రయాణంలో మన్యం తల్లి దారాలమ్మ ఆలయాన్ని సందర్శించానని మార్గమధ్యలో స్థానిక విలేకరులతో మాట్లాడా రు. తాను ఎప్పటి నుంచో కన్యాకుమారి కాలినడకన వెళ్లి దర్శించుకోవాలనే తపన ఉండేదని, నా కల నెరవేరిందన్నారు. కన్యాకుమారి వెళ్లేటప్పుడు తుపాను వల్ల కొంచెం ఇబ్బంది పడ్డానని చెప్పారు. రాత్రి సమయాల్లో దేవాలయల్లో ,పెట్రోల్ బంకుల్లో నిద్రించేవాడినని, సొంతంగా ఆహారాన్ని వండుకునేవాడినని, తప్పనిసరి పరిస్థితుల్లో హోటల్‌లో భోజనం చేసేవాడినని తెలిపారు. వాతావరణం బాగుంటే రోజుకు 12 గంటల పాటు నడక సాగించానని చెప్పారు. వంట సామగ్రి ,వస్తువులు, దుస్తులు తీసుకొని వెళ్లడానికి మాత్రమే సైకిల్‌ను ఉపయోగించినట్టు తెలిపారు. మొత్తం ప్రయాణంలో కన్యాకుమారికి వెళ్లి తిరుగు ప్రయాణానికి 3500 కి.మీ.. 50 రోజులు పట్టిందన్నారు. మరో రెండు రోజుల్లో తన గ్రామానికి చేరుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ సారి ఉత్తర భారతదేశం అంతా పాదయాత్ర చేస్తానని బిశ్వనాథ్ దాస్ తెలిపారు.

సినీ ఫక్కీలో గంజాయి రవాణా.. 50 ప్యాకెట్లు స్వాధీనం

చోడవరం: ట్రాక్టర్ తొట్టి అడుగుభాగంలో రహస్య అరలు..వాటిలో ప్యాకెట్లలో గంజాయి... ఎవరికీ అనుమానం రాకుండా పైన ఖాళీగా తొట్టె ... ఇలా స్మగ్లరు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా చోడవరం పోలీసులు వారి ఎత్తుగడలను చిత్తు చేశారు. 250 కిలోల గంజాయిని బుధవారం పట్టుకున్నారు. గంజాయి విలువ సుమారు రూ.15లక్షలు ఉంటుందని అంచనా. చోడవరంలో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో పెదబయలు నుంచి విశాఖ వెళ్తున్న ట్రాక్టర్ అనుమానాస్పదంగా ఉండడంతో క్షుణ్ణంగా పరిశీలించారు. ట్రాక్టర్ కింద భాగంలో ఏర్పాటు చేసిన అరల్లో ప్యాక్ చేసి ఉన్న 50 గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. ట్రాక్టర్, గంజాయిని స్వాధీనం చేసుకుని, పెదబయలుకు చెందిన నిందితులు చిన్నారావు, త్రిమూర్తులను అదుపులోకి తీసుకున్నారు. దీనిపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. గంజాయి రవాణా వెనుక ఎంతమంది ఉన్నారు, బడాబాబులు ఉన్నారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిసింది.


ఆదివాసీలకు నూరుశాతం రిజర్వేషన్లు కల్పించాలి



కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి దుర్గాదాస్‌ఉయికేకి వినతిపత్రం అందజేస్తున్న ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, చింతపల్లి ఎంపీపీ అనూషదేవి

చింతపల్లి: షెడ్యూల్డ్ ప్రాంతంలో ఆదివాసీలకు వంద శాతం రిజర్వేషన్ కల్పించడానికి చర్యలు చేపట్టాలని కోరుతూ కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి దుర్గాదాస్‌ఉయికేకు ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రతో కలసి వినతిపత్రాన్ని అందించినట్టు చింతపల్లి ఎంపీపీ కోరాబు అనూషదేవి తెలిపారు. పంచాయతీ టు పార్లమెంటు సెమినార్‌కు తరలివెళ్లిన జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, చింతపల్లి ఎంపీపీ అనూషదేవి కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా వారు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి దృష్టికి ఏజెన్సీ ప్రాంతాలకు సంబంధించిన పలు సమస్యలను తీసుకువెళ్లినట్టు తెలిపారు.ప్రధానంగా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో జీవో నెంబర్ 3 అమలు, ఉపాధ్యాయుల నియామకాలు, ఇతర ఉద్యోగాలు భర్తీలో ఆదివాసీ యువతకు వంద శాతం రిజర్వేషన్ కల్పించడం జరిగేదని, మూడేళ్ల క్రితం జీవో నెంబర్–3ను రద్దు చేయడంతో ఆదివాసీ యువత నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటున్నారని మంత్రికి వివరించినట్లు తెలిపారు. షెడ్యూల్డ్ ప్రాంతంలో నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ప్రత్యామ్నాయ చట్టాన్ని తీసుకురావాలని మంత్రిని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించినట్టు వారు తెలిపారు.

రేపే అప్పన్న వైకుంఠద్వార దర్శనం



ముస్తాబవుతున్న స్వామివారు వేంజేసే ఉత్తర రాజగోపురం

సింహాచలం: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం సింహాచలం శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామి వైకుంఠ (ఉత్తర)ద్వార దర్శనానికి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఉదయం 5 నుంచి 10.30 వరకు భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం లభించనుంది. ఈసారి 45 వేల మందికి పైగా భక్తులు వస్తారని అంచనా.

1 గంట నుంచే వైదిక కార్యక్రమాలు

పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి ఆలయ అర్చకులు శుక్రవారం తెల్లవారుజామున ఒంటి గంటకు స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన నిర్వహిస్తారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి వైకుంఠనారాయణుడి అలంకరణ చేసి శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో సహా పల్లకిలో అధిష్ఠింజేస్తారు. ఆలయ బేడా మండపంలో 3.30 నుంచి 4.15 వరకు తిరువీధి నిర్వహిస్తారు. 4.15కు స్వామిని ప్రధాన ఆలయ ఉత్తరద్వారం వద్దకు తీసుకొచ్చి ఆయనపై ఉండే మేలిముసుగుని తొలగిస్తారు. సంప్రదాయం మేరకు అక్కడ దేవస్థానం అనువంశిక ధర్మకర్తకి తొలిదర్శనం కల్పిస్తారు. అనంతరం స్వామిని ఉత్తర రాజగోపురంలో కొలువుంచుతారు. ఉదయం 10.30 వరకు అక్కడే భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తారు. 10.30 నుంచి 11.30 వరకు సింహగిరి మాడ వీధిలో తిరువీధి నిర్వహిస్తారు.

దర్శన వేళల్లో మార్పు : ఉత్తరద్వార దర్శనం శుక్రవారం ఉదయం 10.30కు ముగిసినా మధ్యాహ్నం 2 గంటల వరకు మూలవిరాట్ దర్శనం లభిస్తుంది. మహానివేదన కారణంగా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 వరకు దర్శనాలు నిలుపుచేస్తారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 7 వరకు దర్శనాలు ఇస్తారు. రాత్రి 7 గంటల తర్వాత భక్తులకు దర్శనాలు లభించవు. 9వ తేదీ గురువారం రాత్రి 7 గంటల వరకు మాత్రమే భక్తులకు దర్శనాలు లభిస్తాయి. వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను వైదికులు, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి దేవస్థానం ఈవో వి.త్రినాథరావు బుధవారం పరిశీలించారు.

పటిష్ట ఏర్పాట్లు

◆ సింహగిరిపై పర్మినెంట్ క్యూలైన్లు, తాత్కాలిక క్యూలైన్లతో కలిపి ఈసారి 25 వేల 250 మంది భక్తులు ఒకేసారి వేచి ఉండేలా ఉచిత దర్శనం, రూ.100, రూ.300ల దర్శన క్యూలు, రూ.500 ఉత్తర ద్వార దర్శన ప్రత్యేక క్యూ, ప్రొటోకాల్ వీఐపీల దర్శన క్యూలు ఏర్పాటు చేస్తున్నారు. ◆ క్యూలైన్లలో నడుస్తూనే 15 నిమిషాలపాటు స్వామిని భక్తులు తిలకించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ◆ కేవలం లడ్డూ ప్రసాదాన్ని మాత్రమే విక్రయించనున్నారు. ◆ శుక్రవారం తెల్లవారుజామున 4 నుంచి సింహగిరికి ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటాయి. గురువారం సాయంత్రం 6 గంటల తర్వాత ఏ వాహనాన్నీ సింహగిరికి అనుమతించరు. ◆ సింహగిరిపై నాలుగు భారీ స్క్రీన్‌ల ద్వారా భక్తులు ముక్కోటి ఉత్సవ విశేషాలను తిలకించే ఏర్పాట్లు చేస్తున్నారు. ◆ భక్తుల వాహనాలను కొండ దిగువనే నిలిపేందుకు పలు ప్రదేశాల్లో వాహనాల పార్కింగ్ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు. ◆ 9వ తేదీ రాత్రి నుంచి 10వ తేదీ సాయంత్రం వరకు అడవివరంలో మద్యం దుకాణాలను ఎక్సైజ్ శాఖ మూసివేస్తుంది.